## కథ

“ఛీ! ఛీ! వెధవ ఉద్యోగం. వెధవ బ్రతుకు. పెళ్లాం పిల్లలకి బట్టలు కూడా కొనలేని పరిస్థితి. తన ఆర్థిక పరిస్థితిని చీదరించుకున్నాడు చలపతి.

‘రాబోయే పుట్టినరోజుకి కంచిపట్టు చీర కొనకపోతే ఇక జీవితంలో మీతో కాపురం చేసేది లేదు’ పుట్టిన రోజుకి రెండునెలల ముందే ఆఖరి అల్టిమేటమ్ ఇచ్చేసింది ముద్దుల పెళ్లాం సుందరి. మరీ పెళ్లాం ముద్దు ముచ్చట తీర్చలేని మొద్దుమొహం కాదు చలపతి. కాకపోతే తన జీవితాన్ని పెనవేసుకున్న ఉద్యోగం అలాంటిది. అసలే పీకలలోతు అప్పులు తీర్చలేక ఛస్తుంటే ఈ మధ్యలో పెళ్లాం వార్నింగ్.

“ఈ గండం గడిచేదెలా?” అని ఆలోచిస్తున్న చలపతికి ఆఫీస్ టేబుల్ మీద కనిపించిన ‘అదృష్టం’ తెలుగు వారపత్రిక చేతిలోకి తీసుకుని తిరగేయసాగాడు.

‘బంపర్ శీర్షిక, బంపర్ బహుమతి’ అన్న హెడ్డింగ్ చూసి ఒక్కక్షణం ఆగాడు చలపతి.

# అదృష్టం

‘బడేమియా బిస్కెట్లు తినండి. యాభైవేల రూపాయలు సొంతం చేసుకోండి’ ఒక్క పేజీలో ప్రముఖంగా వ్రాసి వుంది. అసలే డబ్బులకు మొహం వాచిన చలపతి ఆత్రంగా ప్రకటనను మొత్తం చదవసాగాడు.

వరల్డ్‌కప్‌ని ఏ జట్టు గెలుచుకుంటుందో ఊహించి తెలియజేయండి. యాభైవేల రూపాయలను సొంతం చేసుకోండి. దీనిని సాల్వ్ చేయడం అంత కష్టమైన పనేమీకాదు. కొంచెం తెలివి ఉపయోగిస్తే యాభైవేలు సొంతం చేసుకునే అదృష్టవంతులు మీరే కావచ్చు. మరి ఆలస్యం దేనికి? వెంటనే పాతిక రూపాయల విలువచేసే బడేమియా బిస్కెట్ల ప్యాకెట్లు కొనండి. ఒక కూపన్ ఉచితంగా పొంది వెంటనే పూర్తి చేసి పంపండి. మతులు పోగొట్టే బహుమతులను గెల్చుకోండి. బడేమియా ఖావో, పచ్చాస్ హజార్ జీతో!

తన కళ్లను తానే నమ్మలేక ప్రకటనను ఒకటికి రెండు సార్లు చదువుకున్నాడు. యాభైవేల రూపాయలంటే ఒక వంద ఐదొందల నోట్లు అంటే లక్షాధికారి కాకపోయినా అర్ధ లక్షాధికారి అయిపోయిన అనుభూతికి గురయ్యాడు చలపతి. దీంతో తన అప్పులన్నీ తీర్చివేయవచ్చు. తన ముద్దుల పెళ్లాం సుందరి కోరిక కూడా తీర్చవచ్చు అనుకున్నాడు.

చలపతి లక్ష్మీదేవికి ముద్దుబిడ్డ కాకపోయినా సరస్వతిదేవికి మేనల్లుడే. తెలివితేటలకేం కొదవలేని వ్యక్తి. అంతో ఇంతో మెదడు కూడా ఉంది. ఆ విషయం పెళ్లాం సుందరి కూడా ఒప్పుకుంటుంది. మీకు మంచి తెలివితేటలుండబట్టే నన్ను పెళ్లి చేసుకోగలిగారు అని ఎప్పుడూ అంటుండే సుందరి మాటలు గుర్తుకొచ్చాయి చలపతికి.

సాయంత్రం ఆఫీసు నుండి వస్తూనే వంద రూపాయలు ఖర్చుపెట్టి మార్కెట్లో వున్న క్రికెట్‌కి సంబంధించిన పుస్తకాలు అన్నీ కొన్నాడు చలపతి. రెండురోజులు నిద్రాహారాలు మాని ఆఫీసుకి సెలవు పెట్టి వివిధ జట్ల బలాబలాలు బేరీజు వేసి చివరకి వరల్డ్‌కప్‌ని ఇండియానే గెల్చుకుంటుందనే నిర్ణయానికి వచ్చాడు. అలా అని దక్షిణాఫ్రికాని తక్కువ అంచనా వేయలేం. పాకిస్తాన్ కూడా సత్తావున్న టీమే. మరి ఎలా? వెంట్రుకవాసిలో బహుమతి కోల్పోతే? ఎందుకో చలపతి ఎడమకన్ను అదిరింది. ఛీ...ఛీ! పాడు మనసు కీడే శంకిస్తుంది. నో! నో! అలా జరగడానికి వీల్లేదనుకుని నాలుగు కూపన్లు వేరువేరు రకాలుగా నింపి పంపాడు. నాలుగు బిస్కెట్ల ప్యాకెట్ల ఖరీదు వంద రూపాయలు, పుస్తకాల ఖర్చు వంద వెరసి రెండొందలు పోయినా యాభైవేలు లాభమేకదా అనుకున్నాడు. చివరికి ఫైనల్ మ్యాచ్ ఆడే రోజు రానేవచ్చింది.




ఎంతో ఆసక్తిగా ఆట తిలకించిన తరువాత తను ఊహించిన జట్టే వరల్డ్‌కప్‌ని గెల్చుకోవడం చూసి ఎంతో ఆనందంతో కూసింత గర్వంతో మీసం మెలివేయబోయి అది లేనందుకు కొంచెం బాధపడ్డాడు ది గ్రేట్ చలపతి.

ఎదురుచూసిన శుభ తరుణం ఆసన్నమయ్యింది. చలపతి అదృష్టం తెలియజేసే అదృష్టం సంచిక వెలువడింది. గబుక్కున బుక్‌స్టాల్ వాడి చేతిలోంచి వీక్లీని లాక్కున్నంత పని చేశాడు చలపతి. ఫలితాలు ప్రకటించిన పేజీని చూసి సిక్సర్ కొట్టబోయి క్లీన్‌బౌల్డ్ అయినంత పనయింది చలపతికి.

అభిమానులు విరివిగా పాల్గొని పజిల్‌ని విజయవంతం చేసినందుకు చాలా కృతజ్ఞతలు. మాకు సకాలంలో చేరిన ఎంట్రీలు ఆరువేలు. కాగా 293మంది ఆల్‌కరెక్ట్‌గా రాశారు. ఇలాంటి పరిస్థితుల్లో మరే కంపెనీ అయినా లాటరీ పద్ధతి అనుసరించుతుంది. కానీ మా బడేమియా కంపెనీది ఆరంభం నుంచి విశిష్ఠ పంథా అని వేరే చెప్పనవసరంలేదు. అదృష్టం పేరిట కొంతమందికే బహుమతినిచ్చి మిగతా విజేతలను నిరుత్సాహపర్చడం కంటే మరో అన్యాయముండదు. అందుకని బహుమతి మొత్తం యాభైవేలను విజేతలందరికీ సమానంగా పంచాలని నిర్ణయించాం. అలా పంచగా ఒక్కో విజేతకు నూట డెబ్బై రూపాయలు వస్తాయి. దాని నిమిత్తం విజేతలందరికీ మీ అభిమాన క్రికెట్ జట్టు సభ్యులందరూ సంతకం చేసిన బడేమియా క్రికెట్ బ్యాట్‌ను విజేతలందరికీ త్వరలోనే పంపడం జరుగుతుందని తెలియజేసుకుంటున్నాము. ఇలాగే ముందు ముందు కూడా మా బడేమియా కంపెనీని ఆదరిస్తారని ఆశిస్తున్నాము అని మనవి చేసుకున్నాడు ఆ కంపెనీ అధిపతి.

ఎందుకోగానీ తల గోడకేసి బాదుకుని ఏడవాలనిపించింది.

బామ్మగారు బాల్చీ తన్నినప్పుడు కూడా కంట తడిపెట్టని చలపతి జీవితంలో తొలిసారిగా తలుపులు బిడాయించుకుని వెక్కివెక్కి ఏడ్చాడు. ★

**మామిడి మహేంద్ర**